క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా కోటేశ్వరయ్య


కోటేశ్వరయ్య

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ జి.కోటేశ్వరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసులురెడ్డి పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఇదే కళాశాలలో సీనియర్ సైకాలజీ అధ్యాపకులుగా పనిచేస్తున్న కోటేశ్వరయ్యను ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా నియమిస్తూ కాలేజ్ కమిషనరేట్ ఆదేశాలు జారీ చేసింది.

ఆత్మలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలోని పల్లేరు కోనలు వెలసిన శ్రీ ఆత్మలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొల్పి అలంకరించిన నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ధర్మకర్త మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

లారీ యూనియన్ నూతన కార్యవర్గం


ప్రశాంత్, కృష్ణయ్య, శివశంకర వరప్రసాద్

పుత్తూరు: పట్టణ లారీ డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్ల యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో లారీ యూనియన్ పట్టణ అధ్యక్షుడుగా ఎం.ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా వి.వేలు, రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా మనోహర్, మోహన్‌బాబు, కోశాధికారిగా శివశంకర వరప్రసాద్‌ను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

శ్రీనివాస సేతుపై నిబంధనలు పాటించాలి


చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్: తిరుపతిలోని శ్రీనివాస సేతుపై ప్రయాణిస్తున్న వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆర్టీసీ బస్సులకు సంబంధించి వంతెనపై వేగాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. కొందరు ఆర్టీసీ డ్రైవర్లు వంతెనపై బస్సును ఉంచడాన్ని తప్పుబట్టారు. మరికొందరు కండక్టర్లు వంతెనపై బస్సును నిలిపి, టిక్కెట్ కొట్టడం ప్రమాదకరమని హెచ్చరించారు. కొందరు కొంత దూరమే కదా అంటూ ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎదురుగా బస్సులను నడుపుతున్నారని మండిపడ్డారు. ఇంకొందరు వంతెనపై లోడింగ్, అన్‌లోడింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. వంతెన పైనుంచి బస్టాండ్‌లోకి వచ్చే మార్గంలో ర్యాంప్(డౌన్)వద్ద ఆర్టీసీ సర్వీసులు వేగంగా రావడం సరికాదని చెప్పారు. శ్రీనివాస సేతుపై వేగాన్ని తగ్గించాలని ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి అలాచేస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు. వంతెనపై వాహనాల తాకిడి తక్కువగా ఉందనే ఉద్దేశంతో పలువురు స్పీడ్ పెంచుతున్నారని... దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వంతెనపై ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓ క్రమ పద్ధతిలో వెళ్లాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న బీసీ నాయకులు

తిరుపతి కల్చరల్: బీసీల మద్దతుతో ఎన్నికల్లో ఎన్‌డీఏ విజయం సాధించిన నేపథ్యంలో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చి బీసీల సంక్షేమానికి పెద్ద పీట వేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం జిల్లాలోని కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి విజయంలో భాగస్వామ్యులయ్యారని గుర్తు చేశారు. బీసీల మద్దతుతో అధికారం చేజిక్కించుకున్న ఎన్‌డీఏ కూటమి బీసీ అభ్యర్థులకు అధిక శాతం మంత్రి పదవులు కేటాయించడంతో బీసీల సమస్యల పరిష్కారం, బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నేతలు సోమశేఖర్ ఆచారి, మధు ఆచారి, టి.మునిశేఖర్ గౌడ్, వివేక్, కిరణ్, మహిళా అధ్యక్షురాలు యశోద, మహేష్, జగదీష్, మురళి, రామ్మూర్తి, రామ్‌కుమార్ నాడార్ పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే పంటకు రక్ష


రాచపాళెంలో సాగు చేసిన వంకాయలతోట


ఏటుకూరిపల్లెలో సాగు చేసిన బెండతోట

- రసం పీల్చే పురుగుతో పంటకు దెబ్బ
- కూరగాయల పంటల రక్షణపై వ్యవసాయ అధికారుల సూచనలు

పాలసముద్రం: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో సాధారణ పంటలకు బదులు కూరగాయలు సాగు వైపు దృష్టి సారిస్తున్న రైతులు వంకాయ, బెండ, అనపకాయ వంటి తీగజాతి కూరగాయలు పండిస్తున్నారు. హైబ్రిడ్ విత్తనాలు వాడినా.. రసాయన ఎరువులు ఆశించి దిగుబడి తగ్గిస్తాయంటున్నారు. రసం పీల్చే పురుగులతో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ నివారణకు వివరించారు.

వంకాయ సాగు..

వంకాయను దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ, ఎర్రనల్లి ఎక్కువగా నష్టం చేస్తుంది. ఈ పురుగులు ఆకుల అడుగుభాగంలో చేరి రసం పీల్చడం ద్వారా ఆకులు పసుపురంగుకు మారి పైకి ముడుచుకుని ఎండిపోతాయి. ఎర్రనల్లి ఆకు అడుగుభాగాన రసం పీల్చడం వల్ల ఆకులు పాలిపోయి తెల్లగా మారుతాయి. ఆకులపై సాలెగూడు వంటి తీగలు ఏర్పడతాయి. దీపపు పురుగుల వల్ల వంగలో వెర్రి తెగులు వస్తే దిగుబడి పూర్తిగా తగ్గిపోతాయి.

బెండతోటలో

బెండను అధికంగా దీపపు పురుగులు, తెల్లదోమ, ఎర్రనల్లి ఆశిస్తాయి. ఆకుల అడుగు భాగానికి చేరి రసాన్ని పీల్చుతాయి. ఆకులు పైకి ముడుచుకుని పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. ఎర్రనల్లితో ఆకులు తెల్లగా పాలిపోయి పండు బారుతాయి. శంఖు తెగులు(ఎల్లో మొజాయిక్)తెల్లదోమ ద్వారా వ్యాప్తిస్తుంది.

మిరపతోటకు..

మిరపలో పేనుబంక, తామర పురుగులు, తెల్లనల్లి ప్రధానమైన రసం పీల్చే పురుగులు. ఇవి ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చుతాయి. తామర పురుగులతో ముడత, తెల్లనల్లితో కింద ముడత వస్తుంది. పేనుబంక లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చి తియ్యటి పదార్థాన్ని విసర్జించడం వల్ల ఆకులు, కాయలు నల్లటి మసి పూసినట్లుగా మారిపోతాయి. తామర పురుగుల ద్వారా మిరపలో వైరస్ ఎండుతెగులు, మొవ్వుకుళ్ల


రసం పీల్చే ఆకుపై పురుగు

తెగులు, తెల్లదోమ ద్వారా ఆకుముడత తెగులు, పేనుబంక ద్వారా కుకుంబర్ మొజాయిక్ వైరస్ ఆశించి మిరప దిగుబడిపై తీవ్రప్రభావాన్ని చూపుతాయి.

టమాటతోటలో..

ఈ పంటకు ఎక్కువగా పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగు ఆశిస్తాయి. పేనుబంకతో వెర్రితెగులు, తామర పురుగులో కాయలకు మచ్చలు ఏర్పడతాయి. ఎండుతెగులు అనేది వైరస్. ఇది పంటను అధిక నష్టాన్ని కలుగజేస్తుంది. పచ్చదోమ ఆకుల అడుగుభాగం నుంచి రసం పీల్చడం వల్ల ఆకు కొనలు పసుపుపచ్చగా మారి క్రమేపీ ఎర్రబడి ముడుచుకుపోతాయి. తామర పురుగు, పేనుబంక, తెల్లదోమ ఆకుల నుంచి రసాన్ని పీల్చడం ద్వారా మొక్కల ఎదుగుదల లోపించి పూత రాలిపోతుంది.

వీటిని నివారణకు చర్యలు..

పచ్చదోమ, పేనుబంక, తామర పురుగు నివారణకు 2 మిల్లీలీటర్ల డైనిథోయేట్ లేదా 2 మిల్లీలీటర్ల ఫిప్రొనిల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు 1.5 గ్రాములు ఎసిఫేట్, ఎర్రనల్లి నివారణకు 3 గ్రాముల నీటిలో కరిగే గంధకం లేదా 5 మిల్లీలీటర్ల డైకోఫాల్ లేదా 3 మిల్లీలీటర్లు ప్రొపార్‌గైట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్లనల్లి నివారణకు 2 మిల్లీలీటర్ల క్లోరోఫైనాఫైరా లేదా 1.5 గ్రాముల డైపెన్ డ్యూరాన్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పేనుబంక నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బీఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్‌లను సమర్పించాలన్నారు. వివరాలకు 9885125771, 9704425888 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కలిప్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామి కి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: క్యాన్సర్పై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి సూచించారు తిరుపతి రుయా చిన్న పిల్లల విభాగంలో సోమవారం జిల్లా సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్ వైద్యులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో వారి విధులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలపై ప్రజల్లో పూర్తి స్థాయి చైతన్యం కల్పించాల్సిన బాధ్యత సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్ వైద్యులదే అన్నారు. క్యాన్సర్ బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య పరీక్షలు, వైద్యాన్ని చేయించే బాధ్యతలను తీసుకోవాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, ఎస్వీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రోజా రమణి, డాక్టర్ చండీప్రియ, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

13 నుంచి నాబార్డ్ ప్రో మేళా

తిరుపతి కల్చరల్: స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్టియం, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ వారి భాగస్వామ్యంతో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు తరంగ్ ప్రో మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు నాబార్డ్ డీడీ సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో గో ఆధారిత వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు, రైతులు సేంద్రీయ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన కూరగాయలు, పండ్లు, మినుములు, తేనె, బెల్లం తదితర ఉత్పత్తులతో కూడిన 50 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. చీరలు, చేనేత, కలంకారి చీరలు, చెక్కతో చేసిన విగ్రహాలు, కుండలు తదితర చేనేత ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులను, కళాకారులను ప్రోత్సహించడం, వారి ఆదాయ మార్గాలు పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మేళా ప్రదర్శన రోజులలో ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తిరుపతి ప్రజలు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సూర్య, శేషవాహనంపై ఇంద్రవరదుడు


సూర్యప్రభపై స్వామి వారి దర్శనం

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సూర్యప్రభ వాహనం, రాత్రి శేష వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చి ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గరుడోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. ఉదయం అభిషేక పూజల పూర్తి చేసి తదనంతరం గరుడ సేవ ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే రాత్రి కల్పవృక్ష వాహన సేవ ఉంటుందని పేర్కొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాతాశిశు మరణాలు జరగవని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంగా గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. వచ్చిన గర్భిణులకు హిమోగ్లోబిన్, బ్లడ్‌షుగర్, బ్లడ్ గ్రూపింగ్, వీడీఆర్ఎల్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ వంటి పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్లరసం , ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని సూచించారు. అనంతరం 35 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, గర్భిణులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కరెంటుతో జరభద్రం


పొలం


పారుతున్న నీరు

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు మోటార్ల విషయంలో అప్రమత్తత ముఖ్యం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం

చిత్తూరు కార్పొరేషన్: రుతుపవనాలతో తొలకరి జల్లులు కురవడం, మృగశిర కార్తె కూడా ప్రారంభం కావడంతో రైతులు పొలం బాట పట్టారు. ఇప్పటికే పొలాలను దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆపై విత్తనాలు విత్తినప్పటి నుంచి పంట దిగుబడి వచ్చేవరకూ వ్యవసాయ పనులపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తారు. అలాగే పంటలకు నీరు పెట్టడం కోసం తెల్లవారితే చాలు విద్యుత్ తీగలు, విద్యుత్ మోటర్ల వద్ద ఎక్కువగా పని చేస్తుంటారు. చాలా మంది రైతులు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతులను స్వయంగా వారే చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు వహించకపోతే మృత్యువాత పడే అవకాశం ఉంది. పొలాల్లో కర్రస్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతులు తక్కువ ధరల మోటర్లను ఎక్కువగా వాడుతుంటారు. చాలా మంది రైతులు మోటర్లు ఆరుబయట బావి ఒడ్డు, కాలువ ఒడ్డున ఉంచి చిన్న కవర్ కప్పి ఉంచుతారు. అవి కొన్నిరోజులకే దెబ్బతింటాయి. అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో మోటర్లతో ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. సింగిల్ ఫేజ్ తీగ కాలికి తగిలితే మోటరు మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. దానిని తాకగానే కరెంటు షాక్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తగు జాగ్రత్తలు వహిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చని అధికారులు చెప్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్తలు ఇలా..

స్టార్టర్ డబ్బాలను మోటర్ పక్కనే పొలంలో ఉంచి రైతులు కవర్లు కప్పుతూ ఉంచారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశం లేకపోలేదు. డబ్బాలకు ఉన్న తలుపుల గురించి పట్టించుకోరు. వాటిలోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా తెంపి మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫేజు ఏదో కూడా తెలియని విధంగా ఉంటాయి కూడా. వీటిపట్ల కూడా కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. రక్షణ కవర్లను తీసివేయరాదు. నేరుగా స్టార్టర్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫేజు అమర్చుకోవాలి. సొంతంగా మరమ్మతులు చేయడం మంచిది కాదు. స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి.

ఇనుప డబ్బాలతో జాగ్రత్త

చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుప డబ్బాల్లో స్టార్టర్లు, ఫేజులు బిగించడంతో ఎలుకలు డబ్బాల్లోకి వెళ్లి, తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకునే ప్రయత్నం చేయగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

తీగలతో ప్రమాదం

గాలీవానలకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే పొలంలో నుంచి విద్యుత్ తీగలను తీసుకువచ్చి ఇళ్లలో కట్టకట్టి పడేస్తుంటారు. ఆ సమయంలో ఎలుకలు కొరికే అవకాశం ఉంటుంది. రైతులు తీగలను ప్రారంభ సమయంలో తప్పనిసరిగా పరీక్షించాలి. అనంతరం మోటర్లకు తీగలను అమర్చుకోవాలి. పాత తీగల కంటే కొత్త తీగలను అమర్చుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న ప్రదేశాల్లో కొందరు రైతులు మధ్య మధ్యలో తాత్కాలికంగా కర్రలు వేసుకుని వాటికి తీగలు అమర్చుతుంటారు. ఇవి వర్షానికి, గాలులకు కిందపడి ఉంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లో పనులకు వెళ్లినప్పుడు అవి కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. స్తంభాలు దూరంగా ఉంటే ట్రాన్స్‌కో సిబ్బందితో మాట్లాడి విద్యుత్ స్తంభాలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తప్పనిసరి జాగ్రత్తలు

పొలాల్లో మోటర్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహకారంతో మాత్రమే పరీక్షించాలి. వర్షపు నీరు, తేమ తగలని చోటవాటిని అమర్చి రక్షణగా కవర్ కప్పాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఉంచుకోవాలి. మోటరుకు ఏదైనా మరమ్మతులు చేయాలంటే ముందుగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలి.

భద్రంగా ఉండాలి



విద్యుత్ తీగలు, మోటార్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు ప్రారంభించే ముందు మోటార్లకు అమర్చే వైర్లు తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు.

– మునిచంద్ర, ఇన్‌చార్జి ఈఈ ట్రాన్స్‌కో

14న శ్రీగోవిందరాజ స్వామి పుష్పయాగం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈ నెల 14వ తేదీన శాస్త్రోక్తంగా పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 14న ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా చేపట్టనున్నారు. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి, సంపంగి, రోజా, కలువలు తదితర వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు.

వేల్కూరు బాబురెడ్డి రాజీనామా


రాజీనామా చేస్తున్న వేల్కూరు బాబురెడ్డి

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడు పదవికి వేల్కూరు బాబురెడ్డి సోమవారం తమ కార్యాలయంలో రాజీనామా చేశారు. సింగిల్‌విండో సీఈఓ విజయ్‌కుమార్ రెడ్డికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ద్వారా తనకు త్రీమెన్ కమిటీ చైర్మన్ సింగిల్‌విండో అధ్యక్షుడిగా నామినేటెడ్‌గా పదవి వచ్చిందన్నారు. ప్రభుత్వం మారడంతో ప్రజాతీర్పును గౌరవిస్తూ తాను తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు వేల్కూరు బాబురెడ్డి తెలిపారు. ఇకపై అనునిత్యం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడతా అన్నారు.